క్లుప్తంగా

తాగునీటి ఎద్దడి

చండ్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి పంచాయితీ వెంకటాపురంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఈ క్రమంలో ఆగ్రహించిన మహిళలు సోమవారం సుజాతనగర్ రోడ్డుపై ఖాళీ బిందెలతో రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరా 10 రోజులుగా నిలిచిపోయిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు సత్వర చర్యలు తీసుకుని తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోడు పట్టాల కోసం ధర్నా

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లో ఆదివాసీ గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహించి ఏపీఓ డేవిడ్ రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు కారం పుల్లయ్య మాట్లాడుతూ.. చర్ల మండలంలోని కలివేరు పంచాయితీ పరిధిలోని రజబల్లి కాలనీకి చెందిన ఆదివాసీలు గత 40 సంవత్సరాలుగా పోడు వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వారికి 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే గ్రామంలో ప్రజలకు తాగు నీరు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని ఏపీఓ హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో కుంజా శ్రీను, సీతయ్య, నగేష్, చిన్నబి, మల్లయ్య, ముత్తయ్య, సింగయ్య, ఉంగమ్మ, సమ్మక్క, జోగయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

మణుగూరురూరల్: కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారు మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో హైదరాబాద్ పుష్పగిరి కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో కల్పిస్తున్న ఉచిత కంటి ఆపరేషన్ల సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి నేత్ర వైద్యాధికారి జి.సంజీవరావు తెలిపారు. మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీలో కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న 48 మందిని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య ఆస్పత్రికి తీసుకెళ్లి నేత్ర వైద్యాధికారితో మాట్లాడి వైద్య పరీక్షలు చేయించారు. వీరిలో 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. బాధితులను ఈ నెల 12వ తేదీన పుష్పగిరి కంటి ఆస్పత్రికి తరలించి ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, రామానుజవరం మాజీ సర్పంచ్ బాడిశ సతీష్ పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల నివాళి

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక గ్రామానికి చెందిన సోషల్ మీడియా మండల కన్వీనర్ కుమ్మరికుంట్ల సాంబశివరావు తండ్రి కుమ్మరికుంట్ల చిన్న గోపయ్య మృతి సీపీఎం పార్టీకి తీరనిలోటని మండల కార్యదర్శి కారం పుల్లయ్య అన్నారు. సోమవారం కుమ్మరికుంట్ల చిన్న గోపయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న గోపయ్య సీపీఎం ప్రజా పోరాటంలో ముందుండి పనిచేసిన సీనియర్ కార్యకర్త అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, కోర్స చిలకమ్మ, సొసైటీ డైరెక్టర్ బొల్లి సూర్య చంద్రరావు, బొల్లి సత్యనారాయణ, బిల్లా ముత్యాలరావు, బొల్లి నాగేశ్వరరావు, మల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చెలికాని వెంకన్న, నాగిరెడ్డి, జంగిల్ సంపత్ పాల్గొన్నారు.

ఉత్సవాలను జరుపుకోవాలి

మణుగూరురూరల్: సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన సీపీఐ శత ఆవిర్భావ ఉత్సవాలను గ్రామ గ్రామానా ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య పిలుపునిచ్చారు. మణుగూరు మున్సిపాలిటీలోని రాంనగర్‌లో సోమవారం జరిగిన గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం 11మంది సభ్యులతో నూతన గ్రామశాఖ కమిటిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పార్టీ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, ఏఐటీయూసీ అధ్యక్షుడు రాయల బిక్షం, రామచందర్, దండుగుల బాబు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు అర్థరహితం

బూర్గంపాడు: గురుకులాల మాజీ కార్యదర్శి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేసిన ఆరోపణలు అర్థరహితమని బీఆర్ఎస్ నాయకులు కేవీ రమణ అన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గురుకులాల్లో అందిస్తున్న నాసిరకం భోజనంతో విద్యార్థుల అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోతుంటే పట్టించుకోని మంత్రులు.. గురుకులాలను సందర్శించి వాస్తవాలను వెలికితీస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై దిగజారుడు ఆరోపణలు చేయటం సిగ్గుచేటని విమర్శించారు. ఆర్ఎస్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పి, గురుకులాలలో నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు.

వసతి గృహాలపై నజర్

- వరుసగా అధికారుల తనిఖీలు, సమావేశాలు
- భోజనంలో శుచి, రుచి.. పరిసరాల పరిశుభ్రతపై ఫోకస్
- నిబంధనలు పాటించాల్సిందిగా హెచ్చరికలు



అశ్వారావుపేటరూరల్: ఆశ్రమ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ

'కస్తూర్బా గాంధీ'లో తనిఖీ..

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జీఈసీఓ (జెండర్ ఇక్విటీ జిల్లా కోఆర్డినేటర్) అన్నామణి సూచించారు. మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సోమవారం సందర్శించారు. డార్మెటరీ, వంటశాలలను, నిత్యవసరాల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వంటకాలు చేసేటప్పుడు పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు.

గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో..

అన్నపురెడ్డిపల్లిలోని గిరిజన సంక్షేమ పాఠశాలను మండల అధికారుల బృందం సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం సిద్ధం చేసిన వంటకాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వరప్రసాద్, ఆర్ఐ సివిల్ సప్లయ్ ఎస్.వెంకటేశ్వర్లు, ఎంఈఓయూ



అన్నపురెడ్డిపల్లి: వంటకాలను పరిశీలిస్తున్న జీఈసీఓ అన్నామణి

ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో టాస్క్‌ఫోర్స్..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని సున్నంబట్టి గ్రామంలోగల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించింది. ముందుగా సున్నంబట్టి ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అలాగే వంటగది, స్టోర్ రూంను తనిఖీ చేసి వంట కోసం సిద్ధం చేసి కూరగాయాలను పరిశీలించారు. అనంతరం ఇదే ఆశ్రమ పాఠశాల ఆవరణలో నిర్వహి స్తున్న పెదవాగు ప్రాజెక్టు ఉన్నత ఆశ్రమ పాఠశాలను సందర్శించి పరిసరాలు, విద్యార్థుల స్నానాల గదులు మురికి వాసన రావడంతో బాధ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్నానాల గదులో పాకుడు పట్టి ఉండటాన్ని చూసి తక్షణమే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలో వంటశాల, భోజనాల లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించి నమోదు చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంపీఓ సోయం ప్రసాద్‌రావు, ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వర్కర్లతో సమావేశం..

మణుగూరురూరల్: మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి మధ్యాహ్న భోజన వర్కర్లకు సూచించారు. సోమవారం మణుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వర్కర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలు, హాస్టళ్లల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండే విషయంలో పరిశుభ్రత పాటించాలని, వంటశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నాణ్యమైన కూరగాయలతో రుచికరమైన భోజనం తయారు చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, ఎంఈఓ స్వర్ణజ్యోతి, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, పాఠశాలల హెచ్‌ఎంలు, వార్డెన్లు, మధ్యాహ్న భోజన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అశ్వాపురం: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ స్వర్ణ

అశ్వాపురం: మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం మధ్యాహ్న భోజన సిబ్బందితో తహసీల్దార్ స్వర్ణ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండే విషయంలో పరిశుభ్రతను పాటించాలని, నాణ్యమైన కూరగాయలతో రచికరంగా వండాలని ఆమె సూచించారు.

ఈ సమావేశంలో ఎంపీడీఓ వరప్రసాద్, ఎంఈఓ వీరాస్వామి, ఎంపీఓ ముత్యాలరావు, వివిద పాఠవాలలకు చెందిన మధ్యాహ్న భోజన సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతోనే అభివృద్ధి సాధ్యం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దుమ్ముగూడెం: చదువు ఉంటే విద్యార్థులు జీవితంలో ఏదైనా సాధించవచ్చని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. సోమవారం మండలంలోని నర్సాపురం గ్రామంలో సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ కోర్ట్, ఐటీసీ వారి సహకారంతో నిర్మించిన మంచినీటి సౌకర్యం, ఇంకుడుగుంత శంకుస్థాపన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్ కుమార్,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రత్నకుమారి, ఐటీసీ ఎంఎస్‌కే ప్రాజెక్ట్ ఆఫీసర్ జయప్రకాష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బెక్కంటి శ్రీనివాసరావు, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ చిలకమర్తి శ్రీనివాసరావు, స్థానికులు రావులపల్లి రవి, మాజీ జెడ్పీటీసీ అన్నెం సత్యాలు, వాష్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళులు

దమ్మపేట: అనారోగ్యంతో మరణించిన మృతుల భౌతిక కాయాలకు స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణ సోమవారం నివాళులర్పించారు. మండలంలోని తాటిమల్లప్పగుంపు గ్రామంలో అనారోగ్యం కారణంగా మృతి చెందిన తాటి వెంకప్ప, భౌతిక కాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే జారే.. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. గుర్వాయిగూడెం గ్రామంలో మరణించిన కారం ఆదెమ్మ, భౌతిక కాయానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కారం శ్రీరాములు, మడకం రాజేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వినతి

దమ్మపేట: పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ మండల పరిధిలోని గ్రామ పంచాయితీ కార్మికులు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. సోమవారం మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసిన కార్మికులు.. కొద్ది నెలలుగా వేతనాలు లేక కుటుంబ కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే.. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వేతనాలు చెల్లించేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్మికులు గొర్రెపాటి బసవయ్య, రాంబాబు, ప్రభాకర్, అన్నవరం పాల్గొన్నారు.

'ఉపాధి' గ్రామ సభలు

అశ్వారావుపేటరూరల్: జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సామాజిక తనిఖీల నేపథ్యంలో గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు సోమవారం మండలంలోని అచ్యుతాపురం, మల్లాయిగూడెం, కోయ రంగాపురం, నందిపాడు, బచ్చువారిగూడెం గ్రామ పంచాయతీల్లో నిర్వహించారు. ఆయా గ్రామసభలను పంచాయతీ ప్రత్యేకాధికారుల సమక్షంలో నిర్వహించగా, గడిచిన ఏడాది కాలానికి సంబంధించి ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు, కూలీలకు కల్పించిన పని దినాలు, వేతనాల చెల్లింపు వివరాలను వెల్లడించారు. గ్రామసభల్లో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ప్రతేకాధికారుల, కార్యదర్శులు, డీఆర్‌పీలు, ఎస్ఆర్‌పీలు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలి

మణుగూరురూరల్: మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మణుగూరు జెడ్పీ కోఎడ్యుకేషన్ పాఠశాల ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు సత్రపల్లి సాంబశివరావు మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలకు, ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోతోందని, అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎం.అరుణ, సీహెచ్ విజయ, ఎస్.పద్మ, కె.సరిత, మునెమ్మ, కాసులమ్మ, సారమ్మ, రమాదేవి, శాంతి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

చండ్రుగొండ: నేడు చండ్రుగొండ మండలంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రూ.3.60 కోట్లతో నిర్మించిన సీసీరోడ్లు, గ్రావెల్‌రోడ్లు ప్రారంభోత్సవాలు ఎమ్మెల్యే చేస్తారు. రూ.35.60 లక్షల విలువ గల కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేస్తారు. మద్దుకూరు నుంచి ప్రారంభమైయ్యే ఎమ్మెల్యే పర్యటన వివిధ గ్రామాల నుండి సీతాయిగూడెం వరకు సాగుతుంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దుమ్ముగూడెం: మండలంలోని లచ్చిగూడెం విద్యుత్ ఫీడర్‌లోని గ్రామాల్లో నేడు ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ మోహన్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. లచ్చిగూడెం విద్యుత్ ఫీడర్‌లో చెట్టుకొమ్మలు తొలగించే కార్యక్రమం చేపడుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎం కప్ పోటీలకు దరఖాస్తు చేసుకోండి

అశ్వారావుపేటరూరల్: సీఎం కప్ క్రీడా పోటీలకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో చేయాలని స్థానిక ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం మాట్లాడుతూ.. సీఎం కప్-2024 క్రీడా పోటీలను గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో నిర్వహిస్తామని, ఈ పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు cmcup2024.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేయాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శుల, మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఫైర్ సేఫ్టీపై అవగాహన

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఫైర్ సేఫ్టీపై సోమవారం ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణవేణి ఆధ్వర్యంలో భద్రాచలం అగ్నిమాపక అధికారి గుర్రపు శ్రీనివాస్ అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు ఎలా జరుగుతాయి అగ్ని ప్రమాదాలు జరగడానికి గల కారణాలు, అగ్ని ప్రమాదాలు జరిగితే ఎలా ఎదుర్కోవాలి.. తదితర సూచనలు చేశారు. ఫైర్‌మాన్ ఎల్ శివాజీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మల్లెల శ్రీనివాస్ రావు, కళాశాల అధ్యాపక ఆధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

23న సెలవు ప్రకటించాలి


మణుగూరుటౌన్: సింగరేణి సంస్థ ఆవిర్భవించిన డిసెంబర్ 23ను వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించాలని హెచ్ఎంఎస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కొడిపల్లి శ్రీలత సోమవారం ఓ ప్రకటనలో కోరారు. సింగరేణి అభివృద్ధిలో కార్మికుల పాత్రను గుర్తించి సెలవు ప్రకటించాలన్నారు. ఇన్‌కం ట్యాక్స్ రద్దు, సొంతింటి పథకం, 200 గజాల స్థలం కేటాయింపు తదితర వాటిని అందించాలని సీఎం రేవంత్, భట్టిలకు విజ్ఞప్తి చేశారు.

పనికి తగిన పారితోషికం ఇవ్వాలి

గుండాల: ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయకుండా అదనపు పనులు చేయించుకుంటున్నట్లు సీఐటీయూ మండల నాయకురాలు వజ్జ సుశీల అన్నారు. మండల కేంద్రంలో సోమవారం వైద్యాధికారి మనేష్‌రెడ్డికి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వేలు చేయించి ఇంతవరకు ఏరియల్స్, టీఏడీఏలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఇన్సెంటీవ్ డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదిలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపునకు సహకరించాలి

మణుగూరుటౌన్: ట్రాన్స్‌కో, జెన్‌కో నుంచి సింగరేణికి రావాల్సిన రూ.30వేల కోట్ల బకాయిలు చెల్లించేలా రాష్ట్రప్రభుత్వం కృషి చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ కోరారు. మణుగూరు ఓసీ-2లో సోమవారం జరిగిన గేట్ మీటింగ్‌లో పాల్గొన్న ఆయన సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏఐటీయూసీ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని, కార్మికుల సమస్యలపై 50వ స్ట్రక్చర్ సమావేశంలో ఏకాభిప్రాయం కుదిరిందన్నారు. వివిధ కేటగిరీల ఉద్యోగులు అన్‌ఫిట్ అయితే వారసులకు ఉద్యోగాల కల్పన, డిస్మిస్ అయిన జేఎంఈటీలను జేఎంఈటీలుగా తీసుకోవడం, కాంట్రాక్టు కార్మికులకు సౌకర్యాలుయ, ఈపీ ఆపరేటర్లకు ఖాళీలతో నిమిత్తం లేకుండా పదోన్నతులు తదితర అంశాలపై సమావేశంలో



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

ఒప్పించామన్నారు. డిసెంబర్ నుంచి మార్చి వరకు ప్రోత్సాహ బహుమతులు ఇవ్వడానికి తమ డిమాండ్‌తో యాజమాన్యం అంగీకరించిందన్నారు. నాయకులు రాంగోపాల్, రామనర్సయ్య, మేకల ఈశ్వర్, ఆదర్ల సురేందర్, బి.సురేందర్, శనిగరపు కుమారస్వామి, సాయి ప్రకాశ్, సందీప్, సతీష్, రవిశంకర్, నాగరాజు తదితరులు ఉన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం

ప్రజాపాలన విజయోత్సవ సంబురాల్లో ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్: నియోజకవర్గ ప్రజల అండదండలతో పినపాకను అభివృద్ధిలో రాష్ట్రంలోనే నంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిదుతానని, కష్టపడ్డ కార్యకర్తలను కాపాడుకుంటానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం గుట్టమల్లారంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజాపాలన విజయోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత సీఎం రేవంత్‌రెడ్డికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా విజయోత్సవాలను ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న పథకాలను వివరించారు. ఈ సంవత్సర కాలంలో ఎమ్మెల్యేగా తాను నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజల సమక్షంలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి వారి సమక్షంలో సమస్యలు పరిష్కరించానన్నారు. ఈ సందర్భంగా క్యాడర్ నాయకులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కాటబోయిన నాగేశ్వరరావు, శివసైదులు, ఐఎన్‌టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షులు కృష్ణంరాజు, బ్రాంచి సెక్రటరీ గట్టయ్య, మండల కాంగ్రెస్ నాయకులు



మణుగూరుటౌన్: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

పాలమూరి రాజు, సామా శ్రీనివాసరెడ్డి, బీరం సుధాకర్‌రెడ్డి, కూచిపూడి బాబు, సుబ్బారెడ్డి, దొబ్బల వెంకటప్పయ్య, కొర్సా ఆనంద్, వీరంకి వెంకట్రావ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పినపాక: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు సోమవారం ఈ బయ్యారం క్రాస్ రోడ్ల ఘనంగా నిర్వహించారు. అనంతరం జీవీఆర్ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం మాట్లాడిన ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఫ్రీ బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 కే గ్యాస్, రైతులకు రెండు లక్షల రుణమాఫీ అందజేస్తున్నామన్నారు. మండల అధ్యక్షుడు రామనాథం, మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు పెరెం వెంకటేశ్వరరావు, గంగిరెడ్డి వెంకటరెడ్డి, ఉడుముల లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ సతీశ్‌కుమార్

ములకలపల్లి: విధి నిర్వహణలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం అలసత్వం వహించినా సహించేదిలేదని పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్ స్థానిక పోలీసులకు స్పష్టం చేశారు. ములకలపల్లి పోలీస్‌స్టేషన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, గంజాయి వంటి మాదక ద్రవ్యాల రవాణాను ఉక్కుపాదంలో అణిచి వేయాలని ఆదేశించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. స్థానిక సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తొలుత పోలీసులు గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, ఎస్సై కిన్నెర రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుకట్టను శుభ్రం చేయించిన తహసీల్దార్



కరకట్ట వద్ద పనులు పరిశీలిస్తున్న తహసీల్దార్, సీఐ, ఎస్ఐ

దుమ్ముగూడెం: మండల ప్రభుత్వ కార్యాలయాల ఎదురుగా ఉన్న గంగోలు చెరువు కరకట్టను తహసీల్దార్ అశోక్‌కుమార్ డోజర్ వాహనాలతో సోమవారం శుభ్రం చేయించారు. కరకట్ట మీదుగా ప్రజలు వాకింగ్ చేసుకోవడానికి వీలుగా ఉండేందుకు కరకట్టకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను, చెట్లను తొలగించారు. నిత్యం ఉదయం పూట ప్రజలు ఎటువంటి ఇబ్బంది లేకుండా వాకింగ్ చేసుకునేందుకు అనువుగా చెట్లను తొలగించే పని చేపట్టారు. అలాగే రేగుబల్లి బాలికల ఆశ్రమ పాఠశాల దగ్గరలో ఉన్న మురికి కాలువ వలన దుర్వాసన వస్తుండటంతో ఆ కాలువ నిండ గ్రావెల్ మట్టితో నింపి శుభ్రం చేయించారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

గుండాల: ఏజెన్సీ ప్రాంతాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఏయిర్‌పోర్ట్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గంగావత్ వెంకన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు వివిధ అంశాలపై మోటివేషన్ తరగతులు నిర్వహించారు. భవిష్యత్‌లో ఎలా ముందుకు వెళ్లాలో వివరించారు. ఏ రంగంలో ప్రతిభ ఉందో ఆ దిశగా ప్రణాళికతో సాగాలన్నారు. ఈ ఏడాది పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించాలని సూచించారు. కథల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం ఆల్‌ఇన్ వన్ బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బాలరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరువ్యాపారుల పేర్లు నమోదు చేయాలి

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల సీతారామ చంద్రస్వామి వారి ఆలయం ఎదుట చిరు వ్యాపారం నిర్వహించే వారు బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ తడికల శివకుమార్ మాట్లాడుతూ.. పర్ణశాల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయానికి ఆనుకుని గత ముప్పై సంవత్సరాలుగా చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న వారినందరిని ప్రభుత్వం తక్షణమే గుర్తించి భవిష్యత్‌లో నిర్మించ బోయే షాపులకు అర్హులుగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే లిస్టును పునఃపరిశీలించి అర్హత ఉన్నవారందరి పేర్లు అధికారులు నమోదు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భద్రాచలం అసెంబ్లీ అధ్యక్షుడు కొండా చరణ్, నాయకులు కొప్పుల నారాయణ, తిరుపతమ్మ, వెంకటరమణ, సరోజినీ, వీరమ్మ, ఈశ్వరమ్మ, చిన్నమ్మ, నీలం అనిత, చిట్టెమ్మ, నర్సమ్మ, జయమ్మ, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

రగ్గుల పంపిణీ



రగ్గులు అందజేస్తున్న నాగేశ్వరరావు

ములకలపల్లి: కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మంత్రి తుమ్మల అనుచరుడు అడపా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ముత్యాలంపాడు గ్రామానికి చెందిన నిరుపేదలు, వృద్ధులకు రగ్గులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 125 మందికి రగ్గులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగో విడత రుణమాఫీ చేసిన సందర్భంగా ప్రత్యేకంగా రగ్గులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ కారం సుధీర్, వాడే శేషగిరి, కుంజా వెంకటేశ్వర్లు, రాంబాబు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు కలిగి ఉండాలి

పినపాక: వాహనదారులు తప్పనిసరిగా ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, లేదంటే ఆయా వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో ఆయన ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. మావోయిస్టులు వారం రోజులపాటు వారోత్సవాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని తెలిపారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఎదురుపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వెంట వాహన ధ్రువపత్రాలు తీసుకువెళ్లాలని సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌తో శిక్ష తప్పదు

అశ్వాపురం: వాహనదారులు మద్యం సేవించి వాహనాలను నడిపితే శిక్ష తప్పదని అశ్వాపురం ఎస్సై ఎస్‌కె.రహూప్ హెచ్చరించారు. మండలంలో సోమవారం ఆయన సిబ్బందితో వాహన తనిఖీలు



పినపాక: వాహనాల తనిఖీ చేస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలను ఇవ్వవద్దని, వాహనదారులు తప్పకుండా లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. నిబంధలను అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చిరించారు.